RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక


వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 153 | మే 11, 2025 | వెల : రూ.3-00

## సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం (12వ తేదీ) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడొక ప్రకటనలో తెలిపారు. పరిపాలన పరమైన కారణాల వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

# మామిడి పోతున్న రైతు!



- దళారుల చేతిలో నలిగిపోతున్న దుస్థితి
- అన్నదాత కష్టాన్ని రాబందుల్లా ఎత్తుకు పోతున్న వైనం
- సిండికేట్‌గా మారి కర్షకులను ఆగం చేస్తున్న మోసగాళ్లు
- జరుగుతున్న అన్యాయంపై గగ్గోలు పెడుతున్న హాలికుడు
- తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోతున్న శ్రమజీవి

**వేద న్యూస్, తరుణ్ :**

రైతు.. సంవత్సర కాలం పాటు ఎన్నో కష్టనష్టాల కోర్చి పగలనకా! రాత్రనకా!, ఎండనకా! వాననకా!, పురుగనకా! పుట్రనకా! తన చెమట చుక్కలు చిందించి కష్టపడి, ఇష్టపడి పంట పండిస్తే ఆ పండించిన పంటను పందికొక్కుల్లా దోచుకు తినేందుకు అధర్మ ఎత్తుగడలతో కుయుక్తులతో ముందుకు సాగుతున్నారు.

ఏడాది పాటు కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామని.. అన్నదాత.. మార్కెట్ కి వెళ్తే ప్రతిఫలం దక్కే సమయంలోనే రాక్షస అవతారంలో దళారులు ప్రత్యక్షమై రైతును నిండా ముంచుతున్నారు. దళారులంతా సిండికేట్ మాదిరిగా మారి రైతు జేబు గుల్ల చేసి వారి జేబు నింపుకుంటున్నారు. అడిగేవాడు లేడు. ఈ అన్యాయాన్ని ఆపేవాడు ఇంకా అసలే లేడు.

ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎన్ని కాలాలు మారినా, ఎన్ని సంవత్సరాలు గడిచినా రైతు అనే వాడికి పడ్డ కష్టానికి ప్రతిఫలం మాత్రం దక్కదనేది ముమ్మాటికి సత్యం..సృష్టిలో ప్రతి పనికి దానికి తగిన ప్రతిఫలం ఉంటుంది. కానీ ఒక రైతు విషయంలో మాత్రం తను పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కదనేది వాస్తవం. సాధారణ వ్యక్తి నుండి మేధావి శాస్త్రవేత్తల వరకు ఈ విషయాన్ని ఒప్పుకోక తప్పదు. రైతు తాను పండించిన పంటను తనకు నచ్చిన రేటుకు అమ్ముకునే పరిస్థితి లేనప్పుడు తను సంవత్సరం అంతా పడ్డ కష్టానికి పెట్టిన పెట్టుబడికి వచ్చిన పంట పైసలు ఏ విధంగా గిట్టుబాటు అవుతాయి. అంతేకాకుండా వ్యవసాయంపై మాత్రమే ఆధారపడి బతికే చిన్న, సన్నకారు రైతులు ఏ విధంగా తన భార్యా పిల్లలను పోషించుకుంటాడు, పిల్లలను ఎలా చదివించుకుంటాడు. రైతు సంవత్సరం అంతా కష్టపడి పంట పండిస్తే చివరి సమయంలో వర్షాలు పడి, భీకరమైన గాలులు వీచి పండించిన పంట సగం దెబ్బతిని నష్టపోతాడు. బాగున్న మిగతా సగాన్ని అయినా మార్కెట్లో అమ్ముకుందామని వెళ్తే దళారులనే దోపిడీదారుల చేతిలో చిక్కి ఆ మిగిలిన పంటను సగం ధరకే అమ్ముకొని పెట్టిన పెట్టుబడి కూడా నష్టపోయి తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నాడు. రైతులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఆపేదెవరు? అడ్డుకునేది ఎవరు? రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేది ఎవరు? రైతుకు న్యాయం చేసేది ఎవరు? ప్రభుత్వమా? పాలకులా? అధికారులా? అనేది ఎవరికి అంతు చిక్కని, సమాధానం లేని ప్రశ్న అయిపోయింది. ఇప్పటికైనా రైతులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం, పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని మామిడి రైతులు కోరుతున్నారు.



## ప్రభుత్వ వైద్యునిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వైద్యాధికారికి వినతిపత్రం అందజేత

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో సాహితీ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పడదల రవికుమార్ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కోటాచలం కు వినతి పత్రం అందజేశారు. సదరు డాక్టర్ పుల్లెంల శ్రీధర్ ఈనెల ఒకటో తారీఖున ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయనని డిఎంహెచ్‌ఓకు లెటర్ ఇచ్చాడని కానీ రిజైన్ లెటర్‌ను తుంగలో తొక్కి ఓ ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం ఓ పేషెంట్‌ను తీసుకెళ్లగా నిబంధనలు విస్మరించి వైద్యం చేస్తున్నాడని తెలిపారు. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, ఐఎంఏ సభ్యులు, నకిలీ డాక్టర్లు, నకిలీ రేడియాలజిస్టులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కానీ నిబంధనలు పాటించకుండా వైద్యం చేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మాదిగ కులం పేరుతో అవమానపరిచేలా దూషించటం ప్రభుత్వ వైద్యాధికారిగా సిగ్గుచేటని విమర్శించారు. నిబంధనలు పాటించకుండా ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేస్తున్న ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం చేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారులపై చర్యలు తీసుకోని యెడల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనుకు జానయ్య, సూర్యాపేట మండల అధ్యక్షులు చింత సైదులు, సాయి, శ్రవణ్ ఉన్నారు.

## నల్గొండ కలెక్టర్ సుడిగాలి పర్యటన

### ఎత్తిపోతల పథకాల గురించి ఎమ్మెల్యేలు,అధికారులతో సమీక్ష సమావేశం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌లతో కలిసి నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మిర్యాలగూడ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. గతంలో చేపట్టిన,చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. రామచంద్రగూడెం వై జంక్షన్, తడకమళ్ళ ఎక్స్ రోడ్ వద్ద ప్రమాదకరంగా మారిన ఫౌంటెన్‌లు పరిశీలించారు. నూతనంగా మంజూరైన ఫ్లై ఓవర్లు,నిర్మించాల్సిన ప్రదేశాలను పరిశీలించారు.అనంతరం హనుమాన్ పేట ఫ్లైఓవర్ కింద చిరు వ్యాపారులకు నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా కళాభారతి ఆడిటోరియంలో మున్సిపల్,రెవిన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వీడియో ప్రజెంటేషన్ ద్వారా పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. దాంతోపాటు అభివృద్ధి పనుల పేరిట గతంలో జరిగిన అవినీతిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ అవినీతిపై పూర్తి విచారణ చేపడతామని, పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇలా నియోజకవర్గ సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమస్యలను వివరించిన మొట్టమొదటి ఎమ్మెల్యే మీరే అంటూ కలెక్టర్ బత్తుల లక్ష్మారెడ్డిని అభినందించారు. ప్రధానంగా డంపింగ్ యార్డ్ తో సమీప కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించేందుకు పట్టణానికి సుదూర ప్రాంతంలో స్థల సేకరణ జరపాలంటూ అధికారులను ఆదేశించారు.అధునాతన ట్రీట్మెంట్ ప్లాంట్ తో కూడిన డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్,ఆర్టీసీ కాంప్లెక్స్,రోడ్డు వెడల్పు కు ఇబ్బందికరంగా మారిన న్యాయపరమైన చిక్కులను తొలగించేందుకు స్థానిక అధికారులు పూర్తి వివరాలతో ప్రతిపాదనను పంపినట్లయితే లీగల్ సెల్ ద్వారా సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపల్ సిబ్బందిని పెంచేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు.గతంలో నిర్మించిన ఫౌంటెన్లు కారణంగా జరిగిన ప్రమాదాల వివరాలు అందచేసినట్లయితే.ఆ స్థానంలో మళ్ళీనిర్మాణం జరిపి ప్రమాద నివారణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అనంతరం మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న ఎత్తిపోతల పథకాల పనుల పురోగతిపై కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మరియు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## కనులపండువగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని కొప్పుల గ్రామంలో కనుల పండుగ పెద్దమ్మ తల్లి ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి,పెద్దమ్మతల్లి వారి ఆశీస్సులు, దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే అన్నారు.కొప్పుల గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయం అని కొనియాడారు. కొప్పుల పెద్ద గ్రామం ఈ గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్త అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు అమ్మవారి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన మత్స్యగిరి స్వామి బ్రహ్మోత్సవాలు

**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు వేద మంత్రోచ్ఛారణల మధ్య శనివారం ఘనంగా ప్రారంభం అయినాయి. శనివారం అంకురారోహణము, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన పూజ యాగ్నికులు వీరవెల్లి వేణుగోపాలాచార్యులు, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి పూజ హోమం నిర్వహించినారు. అనంతరం ద్వజారోహం, గరుడ పటం ఎగరవేసినారు. తర్వాత గరుడ ముద్ద ప్రసాదాలు సంతానం లేని దంపతులకు, భక్తులకు పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సామల బిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్సేనారెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్వరరావు, వినుకొండ శంకరాచారి, దిండిగాల వంశి, కాంబత్తుల ప్రకాష్, మంత్రి చందు, గిద్దమారి సురేష్, నడిగట్టు సాంబయ్య భక్తులు పాల్గొన్నారు.

## ప్రేమ వివాహం చేసుకున్న కూతురు

- దాడి చేసిన కుటుంబ సభ్యులు..!
- కేసు నమోదు చేసిన పోలీసులు

**వేద న్యూస్, శాయంపేట:**

తల్లి తండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకున్న కూతురు పై దాడి చేసిన ఘటన శాయంపేట మండలంలో చోటు చేసుకొంది. సిఐ రంజిత్ రావు తెలిపిన వివరాల ప్రకారం ప్రేమ వివాహం చేసుకున్న యువతిని కొట్టిన కుటుంబ సభ్యులు దుగ్గొండి మండలంలోని మందపల్లికి చెందిన మేదరి శృతి, శాయంపేట గ్రామానికి చెందిన అంబాల రామకృష్ణ అను ఇద్దరూ ప్రేమించుకొని 09.05 2025 రోజున గుడిలో వివాహం చేసుకున్నారు. ఇట్టి వివాహం నచ్చని యువతి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో యువతి పై కోపంతో వధూవరులను నానా బూతులు తిట్టి చేతులతో కొట్టినారని యువతి ఫిర్యాదు ఇవ్వగా తల్లి భారతి, తండ్రి మొగిలి, అన్నయ్యలు మేదరి వంశీ, నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు శాయంపేట సిఐ తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మిడిదొడ్డి నరసింహ

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలలో వివిధ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ శ్రీసేవ అనాథాశ్రమం నిర్వాహకులు మిడిదొడ్డి నరసింహ చింతపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన కానుగుల అంజయ్య మణెమ్మ కుమారుడు కానుగుల సురేష్ వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు శ్రీ సేవ అనాథాశ్రమ అధ్యక్షులు మిడిదొడ్డి నరసింహ. ఉభయ జిల్లాలలో సేవా కార్యక్రమాలతో పాటు, వేసవికాలంలో చలివేంద్రాల ఏర్పాటు లో కృషి చేస్తున్న మిడిదొడ్డి నరసింహ సేవలు అనూహ్యం. ఈ వేడుకల్లో ఎం పవన్, వై రవి,ఎం శివ,ఎం రమేష్,ఎం హరి,వై కల్పన,ఎస్ నాగరాజు, ఏ శ్రీకాంత్, బి శివ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సినీ పాటల విభావరి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

శ్రీరామ్ సుస్వరాలు ఆధ్వర్యంలో 11వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుండి రాత్రి 9 గంటల వరకు త్యాగరాయ గాన సభ సంగీత హాల్ నందు శ్రీరామ్ సుస్వరాలు 30 వ పాటల విభావరి జరగనుందని శ్రీ సుస్వరాలు అధినేత డాక్టర్ మూర్తి శ్రీరామ్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మనం ఫౌండేషన్ అధ్యక్షులు వ్యవస్థాపకులు డాక్టర్ కే చక్రవర్తి, స్వర కిన్నెర, శారదా వరపుత్ర, గాన కంఠిరవ, డాక్టర్ చింతలపూడి త్రినాథరావులు విశిష్ట అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర బ్రహ్మ గ్లోబల్ సింగర్ డాక్టర్ మూర్తి శ్రీరామ్, గాయని మల్లాది ఉష, రాకింగ్ స్టార్ సింగర్ డాక్టర్ సోమయాజులు, డాక్టర్ అర్చన, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ ఫ్లారెన్స్, డాక్టర్ అరుణ జ్యోతి, రీటా, శ్రీదేవి, ప్రభావతి,దయాకర్ రావు, శారద, సులక్షణ,స్వప్న, వర్ధమాన గాయకులు భరద్వాజ్,డాక్టర్ కాసిం భాషా, డాక్టర్ అంజయ్య, నందగోపాల్, వి ఎల్ వి ఆర్ జోస్యులు, రాజశేఖర్ తమ గళాలు వినిపిస్తారని సినీ సంగీత అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మూర్తి శ్రీరామ్ డాక్టర్ శ్రీ సోమయాజులు డాక్టర్ కె అర్చన కోరారు.

# తెలంగాణ తిరుపతి...చిలుకూరు బాలాజీ

**వేద న్యూస్, అక్కినేపల్లి పురుషోత్తమరావు/ రంగారెడ్డి ప్రతినిధి :**



కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా వెలువందుతున్న చిలుకూరు బాలాజీ దేవాలయం భక్తుల పాలిటి కొంగుబంగారంగా విరాజుల్లుతున్నది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బాలాజీని దర్శించుకుంటారు. ఇక్కడ స్వామి వారిని "వీసాల బాలాజీ" అని కూడా పిలుస్తుంటారు. తెలంగాణ తిరుమల గా పేరొందిన చిలుకూరు బాలాజీ ఆలయానికి 500 ఏళ్ల పైగా చరిత్ర ఉంది. ఉస్మాన్ సాగర్ సమీపాన ఈ దేవాలయం ఉంది. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా వెలుగొందుతున్న చిలుకూరి బాలాజీ దర్శనం చిరస్మరణీయం. చిలుకూరు బాలాజీ ఆలయం హైదరాబాదు నుంచి 25 కిలోమీటర్ల దూరంలో వికారాబాద్ వెళ్లే మార్గంలో ఉంది. మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలోని ఉస్మాన్ సాగర్ రోడ్డున ఉంది.

చిలుకూరు బాలాజీ ఆలయానికి చేరుకోవడానికి అన్ని ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉన్నాయి ఎక్కడి నుంచి అయినా మెహిదీపట్నం చేరుకుంటే అక్కడి నుంచి ఐదు నిమిషాలకు ఒక బస్సు (288డీ) అందుబాటులో ఉంటుంది.

– ఆలయ చరిత్ర

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు బాలాజీ ఆలయానికి 500 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పరమ భక్తుడైన గున్నాల మాధవరెడ్డి ఈ చిలుకూరులో ఉండేవారు. అతను ఏటా ఎంత కష్టమైనా కాలినడకన తిరుపతికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని వచ్చేవారు. అలా ఒకసారి తిరుమలకు బయలుదేరిన మాధవరెడ్డి ప్రయాణంలో అలసిపోయి మార్గమధ్యలో సొమ్మసిల్లి పడిపోయారు. ఆ మగత నిద్రలో వచ్చిన కలలో స్వామి వారు ఆయనకు ప్రత్యక్షమయ్యారు.


మాధవ ఇకపై నువ్వు నా దర్శనం కోసం ఇంత దూరం ప్రయాసపడి రావలసిన అవసరం లేదులే. నేనే చిలుకూరులో ఒక పుట్టలో కొలువై ఉన్న. వెలికి తీసి గుడి నిర్మించు అని చెప్పి మాయమయ్యాడు. నిద్ర నుంచి మేల్కొన్న మాధవరెడ్డి ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు అంతా కలిసి వచ్చే అక్కడ ఉన్న పుట్టను గునపాలతో పెకిలిస్తుండగా గుణపం బాలాజీ ఎద భాగంలో తగిలి రక్తం వచ్చింది. అలా దొరికిన బాలాజీకి ఇక్కడే ఆలయాన్ని నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. ఆలయంలో కొలువైన బాలాజీ ఎద భాగంలో గుణపం గుచ్చుకున్న ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. ఈ దేవాలయంలో 1968లో రాజ్యలక్ష్మి అమ్మవారిని ప్రతిష్ఠించారు. బాలాజీ ఆలయాన్ని దర్శించడానికి ప్రతిరోజు వేళల్లో భక్తులు వస్తుంటారు ప్రతిరోజు 20 నుంచి 30 వేల మంది భక్తులు సెలవు దినాల్లో 75 వేల నుంచి లక్ష మంది భక్తులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

ఆలయాన్ని ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి భక్తుల దర్శనార్థం తెరిచి ఉంచుతారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఏటా చైత్ర శుక్ల మాసంలో వారం రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఇక ప్రత్యేక పూజలు కూడా ఏమీ ఉండవు. దర్శన సమయంలో విరామం ఉండదు ఫోన్లో ఆన్లైన్లో టికెట్లు బుక్ చేసుకోవడం లాంటివి ఏమీ ఉండవు. ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులు బాలాజీ ని దర్శించి మొక్కుకుంటే వీసా వస్తుందని నమ్మకం ఏర్పడింది. అప్పటినుంచి ఈ స్వామిని వీసా గాడ్ అని పేర్కొంటారు.

ఈ దేవాలయ ప్రాంగణంలో 450 సంవత్సరాలు చరిత్ర కలిగిన రావి చెట్టు ఉంది. ఈ చెట్టును తాకే శివ దర్శనం చేసుకుంటే మనసులోని కోరికలు తీరుతాయనేది భక్తుల నమ్మకం దేవాలయం ఆధ్వర్యంలో ఒక పత్రిక నడుస్తుంది ఆ పత్రిక ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయ నిర్వహణ జరుగుతుంది. ఆలయ ప్రాంగణంలో శివాలయం ఉపాలయాలుగా సుందరేశ్వర హనుమాన్ ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయానికి 2014లో స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

– హుండీ లేని దేవాలయం


ఈ దేవాలయంలో అందరూ సమానమే అనే రీతిలో దర్శనం చేసుకోవచ్చు. అన్ని దేవాలయాల్లో ఉన్నట్టుగా విఐపి దర్శనం టికెట్ దర్శనం అంటూ ఏమీ లేవు. ప్రధానమంత్రి అయినా సరే మామూలు దర్శనం చేసుకోవాల్సిందే ఈ దేవాలయంలో హుండీ కూడా ఉండదు. ఇతర దేవాలయాల్లో హారతి ఇచ్చినప్పుడు ఇక్కడ నిత్య పూజలు అంటూ ఏమీ ఉండవు. వెంకటేశ్వర స్వామి



చిలుకూరు బాలాజీ ఆలయాన్ని మొదటిసారి దర్శించి 11 ప్రదక్షిణలు చేసి కోర్కెలు నెరవేరిన తర్వాత 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకునే పద్ధతి ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది.

## మాతృదినోత్సవ శుభాకాంక్షలు..

తన గర్భం నుండి భూమి మీదకి తీసుక్కొచ్చి
లోకాన్ని పరిచయం చేస్తుంది అమ్మ..!
కనులు తెరిచిన క్షణం నుంచి చివరి దుప్పటి కప్పుకొనే వరకు బంధం కోసం కుటుంబం కోసం అందరికి ఆత్మీయత పంచి, అహర్నిశలు కష్టించి, తన ఇంటిని నందనవనం చేస్తుంది అమ్మ..!
నీడలా వెన్నంటే ఉంటూ జ్ఞానాన్ని అందించే
సరస్వతీ దేవిలా పెంచుతుంది అమ్మ..!
గురువులా లోకం పోకడలు, నవసమాజ
నిర్మా ణానికి అవసరమైన అన్ని అర్హతలు
కలిగి ఉన్న ఒక బాధ్యత గల పౌరురాలుగా,
పౌరుడిగా పెంచుతుంది అమ్మ..!
తొలి అడుగు తానై నడిపిస్తు మంత్రిగా,
మార్గదర్శిగా లోపాల్ని సరిదిద్దుతూ మన జీవితానికి పునాదులు ఏర్పరుస్తు పెంచుతుంది అమ్మ..!
పచ్చని చెట్ల మధ్య గంతులు వేసే జింకపిల్లలా పెంచుతుంది అమ్మ..!
తరతరాల చరిత్రకు సాక్ష్యం అమ్మ,
అమ్మ లేకపోతే జననం లేదు. అమ్మ లేకపోతే గమనం లేదు. అమ్మ లేకపోతే సృష్టిలో జీవం లేదు. అమ్మ లేకపోతే అసలు సృష్టే లేదు".. కంటిపాపలా కాపాడే అమ్మకి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు



**మంజుల పత్తిపాటి (కవయిత్రి), మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం, 9347042218.**

## మన ఎస్-400, బ్రహ్మోస్ మిస్సైల్ స్థావరాలకు ఎలాంటి నష్టం కలగలేదు

**పాకిస్థాన్ తప్పుడు ప్రచారాన్ని బహిర్గతం చేసిన భారత విదేశాంగ శాఖ**

**వైమానిక స్థావరాలు, ఆయుధాగారాలకు నష్టంపై పాక్ వాదనలు అసత్యం అని వెల్లడి**

**- మీడియాకు వివరాలు తెలిపిన కల్నల్ సోఫియా ఖురేషి**



**వేద న్యూస్, డెస్క్:**

భారత సైన్యానికి తీవ్ర నష్టం వాటిల్లిందంటూ పాకిస్థాన్ సాగిస్తున్న దుష్ప్రచారాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. తమ ఎస్-400, బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలు ధ్వంసమయ్యాయని, పలు వైమానిక స్థావరాలు, ఆయుధాగారాలపై దాడులు జరిగాయని పాకిస్థాన్ చేస్తున్న వాదనలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. ఉగ్రవాద శిబిరాలపై భారత్ జరిపిన దాడుల అనంతరం ఇరు దేశాల మధ్య కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయాలని ఒప్పందం కుదిరిన నేపథ్యంలో పాకిస్థాన్ ఈ తప్పుడు వార్తలను వ్యాప్తి చేస్తోందని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ, "పాకిస్థాన్ తమ జేఎఫ్-17 విమానాలతో మా ఎస్-400, బ్రహ్మోస్ క్షిపణి స్థావరాలను ధ్వంసం చేసినట్లు చెప్పుకోవడం పూర్తిగా అవాస్తవం. సిర్సా, జమ్మూ, పఠాన్‌కోట్, భటిండా, నలియా, భుజ్ వంటి మా వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయని వారు చేస్తున్న ప్రచారం కూడా కల్పితమే" అని తెలిపారు. చండీగఢ్, వ్యాస్‌లలోని భారత ఆయుధాగారాలు దెబ్బతిన్నాయన్న పాక్ వాదనలు కూడా పూర్తిగా అబద్ధమని ఆమె కొట్టిపా రేశారు. అంతేకాకుండా, భారత సైన్యం మసీదులను ధ్వంసం చేసిందంటూ పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను కల్నల్ ఖురేషి తీవ్రంగా ఖండించారు. "భారత్ ఒక లౌకిక దేశమని, మా సైన్యం రాజ్యాంగ విలువలకు అద్దం పడుతుందని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను" అని ఆమె అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)కు చెందిన ఫ్యాక్ట్ చెక్ విభాగం కూడా భారత సాయుధ బలగాలపై పాకిస్థాన్ చేస్తున్న పలు వాదనలను ఇప్పటికే ఖండించింది.



# ఐపిఎల్ వాయిదా : బిసిసిఐ



వేద న్యూస్, డెస్క్ : : ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18 వారం రోజులు వాయిదా పడింది. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపిఎల్ మిగిలిన మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపిఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఐపిఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంతకాలం వాయిదా వేసినట్లు బిసిసిఐ అధికారులు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం లక్నో వేదికగా లక్నో-బెంగళూరు జట్ల మధ్య ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. ధర్మశాల వేదికగా ఢిల్లీ-పంజాబ్ జట్ల మధ్య గురువారం జరగాల్సిన మ్యాచ్ కూడా అర్ధాంతరంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇక ఈ సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచులు, రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, మే 25న కోల్‌కతా వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 57 లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇంకా 16 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. ఐపిఎల్ టోర్నమెంట్‌ను వారంరోజులు వాయిదా వేయడాన్ని అన్ని ఫ్రాంచైజీలు మద్దతు తెలిపాయి. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సహా పలు ఫ్రాంచైజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ వారం రోజుల్లో జరిగే మ్యాచ్‌ల టికెట్ డబ్బులను వాపస్ ఇస్తామని ఆయా ఫ్రాంచైజీలు 'ఎక్స్' వేదికగా వెల్లడించాయి. మే 10న (శనివారం) ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడాల్సి ఉంది. దీంతో ఆ మ్యాచ్ టికెట్లు కొన్నవాళ్లకు డబ్బులు రీఫండ్ చేస్తాం' అని ఆరెంజ్ ఆర్మీ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. అలాగే లక్నో-బెంగళూరు మధ్య లక్నోలోని ఏక్నా స్టేడియంలో శుక్రవారం జరగాల్సిన మ్యాచ్‌కు సంబంధించి తిరిగి ఇచ్చేస్తామని ఆ ఫ్రాంచైజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

# త్రివిధ దళాలకు క్రీడాకారుల సంఘీభావం!



వేద న్యూస్, డెస్క్ : అపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య తీవ్ర యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో భారత క్రీడాలోకం త్రివిధ దళాలకు మద్దతుగా నిలిచింది. దేశ ప్రజల సంరక్షణ కోసం శ్రమిస్తున్న భద్రత దళాలకు పలువురు క్రీడాకారులు మద్దతుగా నిలిచారు. సైన్యం సేవలను కొనియాడుతూ పలువురు స్టార్ క్రీడాకారులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తామంతా సైన్యం వెంటే ఉన్నట్టు తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సయితం లెక్క పెట్టకుండా సరిహద్దుల్లో పోరాడుతున్న మన సైనికులకు సెల్యూట్ అంటూ కోహ్లి పోస్ట్ చేశాడు. క్లిష్ట సమయంలో అనుక్షణం దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న మన సైనికులకు అందరు మద్దతుగా నిలవాలని, వారిలో కొత్త ధైర్యాన్ని నింపాలని కోరాడు. దేశ సంరక్షణలో భాగంగా మన సైన్యం తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ పేర్కొన్నాడు. మన దేశ గౌరవాన్ని పెంచడంలో సైనికులు ఎప్పుడూ ముందుంటారని వారి సేవలను కొనియాడాడు. మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగమే జాతికి బలమని భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితుల వేళ మన త్రివర్ణ పతకాన్ని ఎగురవేసిన మీ ధైర్యాన్ని, నిస్వార్ధ సేవలను ఎల్లవేళలా గుర్తుంచుకుంటామని సింధు తెలిపింది. వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్, సౌరభ్ గంగూలీ, కైఫ్, అశ్విన్, యువరాజ్, ఇర్ఫాన్ పఠాన్ తదితర క్రికెటర్లు సయితం సైనికులకు సెల్యూట్ చేస్తూ పోస్టులు పెట్టారు.

# సెమీస్‌కు ఆయుశ్, ఉన్నతి



వేద న్యూస్, డెస్క్ : తైపీ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి ఆయుశ్ శెట్టి, ఉన్నతి హుడా దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి 16-21, 21-19, 21-14తో బి.యంగ్(కెనడా)పై చెమటోడ్చి నెగ్గాడు. ముఖ్యంగా రెండో గేమ్‌లో ఇరువురు షట్లర్లు ప్రతి పాయింట్ కోసం పోరాడారు. ఆ సెట్‌లో ఆయుశ్ చేజిక్కించుకొని.. మూడో గేమ్‌లో యంగ్‌కు ఆయుశ్ ముచ్చెమటలు పట్టించి ఆ గేమ్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో ఉన్నతి ఉన్నతి హుడా కూడా సంచలనం నమోదు చేసింది. తనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న తైపీకి చెందిన వై.యంగ్‌పై మూడుసెట్ల హెూరాహెూరీ పోరులో చిత్తు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఆ గేమ్‌లో ఉన్నతి 21-8తో తొలి గేమ్‌ను చేజిక్కించుకొని.. రెండో గేమ్‌లో పోరాటాపోటీగా తలపడి 19-21తో ఆ సెట్‌ను కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 21-19తో చేజిక్కించుకొని సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఉన్నతి జపాన్‌కు చెందిన మియాజాకితో తలపడనుంది.

# రికర్వ్‌లో సెమీస్‌కు దీపిక, పార్థ్



**వేద న్యూస్, డెస్క్ :** ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2 వ్యక్తిగత విభాగాల్లో దీపిక కుమారి, పార్థ్ సలుంకే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ పోటీలో పార్థ్ మూడు సార్లు ఒలింపిక్ ఛాంపియన్ కొరియాకు చెందిన కిమ్- జె-డియాక్‌ను చిత్తుచేశాడు. తొలిరౌండ్‌లో ఏకంగా మాజీ ఒలింపిక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మాటే గజోజ్(టర్కీ)ను షూట్-ఆఫ్‌లో ఓడించిన పార్థ్%రా% ఆదివారం జరిగే వ్యక్తిగత సెమీస్‌లో పార్థ్ కొరియాకే చెందిన పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ కిమ్ పూజిన్‌తో తలపడతాడు. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో దీపిక కుమారి పారిస్ ఒలింపిక్స్ టీమ్ రజత పతక విజేత, చైనాకు చెందిన లీ-జియామన్‌పై 6-2తో విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో దీపిక కుమారి ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్, కొరియాకు చెందిన లిమ్-సిహియోన్‌తో అమీ తుమీ తేల్చుకోనుంది. ఇక మిక్స్‌డ్ విభాగం సెమీఫైనల్లో అభిషేక్ వర్మ-మధుర ధమన్‌గోంకర్ 156-158పాయింట్ల తేడాతో బ్రిటన్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు. శనివారం జరిగే కాంస్య పతక పోరులో వీరు మలేషియాకు చెందిన ఫాతిన్-మహ్మద్ జువైదితో తలపడ నున్నారు. ఇక కాంపౌండ్ టీమ్ ఫైనల్లో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్లో మెక్సికో తలపడనున్నాయి.

# టెస్ట్ క్రికెట్ కోహ్లీ గుడ్‌బై?



వేద న్యూస్, డెస్క్ : టీం ఇండియా రన్ మెషీన్, కింగ్ విరాట్ కోహ్లీ ఫ్యాన్స్‌కి షాకింగ్ న్యూస్. టీం ఇండియా త్వరలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. అక్కడ అతిధ్య జట్టుతో భారత్ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. అయితే ఇప్పటికే భారత జట్టుకు ఓ షాక్ తగిలింది. ఈ సిరీస్‌కి ముందే టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ప్రకటించాడు. తాజాగా కింగ్ విరాట్ కోహ్లీ కూడా టెస్ట్‌ల నుంచి రిటైర్ అవ్వాలనే యోచనలో ఉన్నట్లు క్రికెట్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని అతను బిసిసిఐతో చెప్పినట్లు సమాచారం. ఇంగ్లండ్ పర్యటన భారత జట్టుకు ఎంతో ప్రతిష్టాత్మకమైనది. ఇప్పటికే రోహిత్ శర్మ రిటైర్ అవ్వడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇప్పుడు విరాట్ కోహ్లీ కూడా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయితే జట్టు మిడిలార్డర్ చాలా బలహీనం అవుతుంది. దీంతో విరాట్ రిటైర్‌మెంట్ నిర్ణయం గురించి పునరాలోచించుకోవాలని బిసిసిఐ అతన్ని కోరినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మరి కోహ్లీ తన నిర్ణయాన్ని మార్చుకుంటాడో.. లేదో వేచి చూడాల్సిందే.

# భయాందోళనలో విదేశీ క్రికెటర్లు?



వేద న్యూస్, డెస్క్ : భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఐపిఎల్‌లో వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్న విదేశీ క్రికెటర్లలో ఆందోళన నెలకొంది. దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బిసిసిఐ ఇప్పటికే ఐపిఎల్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఇదిలావుంటే ఐపిఎల్‌లో ఆడేందుకు భారత్‌కు వచ్చిన విదేశీ క్రికెటర్లలో భయం వాతావరణం ఏర్పడింది. ఎప్పుడూ ఏ జరుతుందోనని భయపడుతున్నారు. ఈ సీజన్‌లో ఆస్ట్రేలియాకు చెందని ఎక్కువ మంది క్రికెటర్లు వివిధ జట్ల తరుపున ఆడుతున్నారు. ప్యాట్ కమిన్స్, హాజిల్‌వుడ్, ఆడమ్ జంపా, టిమ్ డేవిడ్, ట్రావిస్ హెడ్, స్టార్క్, స్టోయినిస్ తదితర ఆస్ట్రేలియా ఆటగాళ్లు వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అంతేగాక ఇంగ్లండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, శ్రీలంక దేశాలకు చెందిన క్రికెటర్లు కూడా ఐపిఎల్‌లో ఆడుతున్నారు. ప్రస్తుతం వీరందరిలో భయం నెలకొంది. సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి వెళ్లి పోవాలనే ఆలోచనలో వీరున్నట్టు తెలుస్తోంది. కాగా, బిసిసిఐ టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసిన నేపథ్యంలో విదేశీ క్రికెటర్లు తమ తమ దేశాలకు వెళ్లిపోతారా లేకుంటే భారత్‌లోనే ఉంటారా అనే దానిపై స్పష్టత రావడం లేదు.

# పాకిస్థాన్ కు అంత సీన్ లేదు



**వేద న్యూస్, డెస్క్ :** భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఐపీఎల్ 2025 సీజన్‌ను వాయిదా వేస్తూ బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు అలుముకున్న నేపథ్యంలో, క్రికెటర్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ చర్య చేపట్టినట్లు బీసీసీఐ స్పష్టం చేసింది. దాయాది దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో, ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సముచితం కాదని బీసీసీఐ భావించింది. ఐపీఎల్‌లో కేవలం భారత ఆటగాళ్లే కాకుండా, పలువురు విదేశీ క్రికెటర్లు కూడా పాల్గొంటున్నందున, వారి భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. టోర్నమెంట్ ప్రస్తుతం కీలక దశలో ఉందని, ధర్మశాల, చండీగఢ్, ఢిల్లీ, జైపూర్ వంటి నగరాల్లో జరగాల్సిన ముఖ్యమైన మ్యాచ్‌లు ఉన్నాయని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలపై భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు గంగూలీ స్పందిస్తూ, "ప్రస్తుత దేశ పరిస్థితుల దృష్ట్యా బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే. ఆటగాళ్ల భద్రత చాలా ముఖ్యం. గత మ్యాచ్ సమయంలో ఏం జరిగిందో మనం చూశాం. అయితే, త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయి. ఐపీఎల్ 2025 సీజన్ తప్పకుండా పునఃప్రారంభమవుతుంది. ఒత్తిడిని ఎక్కువ కాలం తట్టుకునేంత సత్తా పాకిస్థాన్‌కు లేదు" అని ధీమా వ్యక్తం చేశారు.

వేద న్యూస్

ఆదివారం మే 11, 2025



## సోషల్ మీడియా కన్వీనర్‌ని అభినందించిన మాజీ ఎమ్మెల్యే

**వేద న్యూస్, శాయంపేట:**

నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ శాయంపేట మండల సోషల్ మీడియా కన్వీనర్ దాసి శ్రావణ్ కుమార్ ను అభినందించిన భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాయంపేట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మనోహర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మారపెల్లి నందం, మండల యూత్ అధ్యక్షులు మారెపల్లి మోహన్, శాయంపేట గ్రామశాఖ అధ్యక్షులు గాదె రాజేందర్,మాజీ ఉప సర్పంచ్ దైనంపెల్లి సుమన్, సీనియర్ నాయకులు గంట శ్యాంసుందర్ రెడ్డి, కరుణ్ బాబు, సౌల్ల కిష్టయ్య, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి దేశ సేవలో భాగమవ్వండి

- మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజు

**వేద న్యూస్, మడికొండ :**



మన దేశ సైనికులు మనకోసం తమ ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడుతున్నారని, యువతగా రక్తదానం చేసి సైనికులకు, అవసరమైన వారికి సహాయంగా ఉండాలని మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజు పిలుపునిచ్చారు. తాను 35 సార్లు రక్తాన్ని దానం చేశానని అలాగే దాదాపు మరొక వెయ్యి మందితో రక్తాన్ని దానం చేసే విధంగా ప్రోత్సహించానని అన్నారు. ఇప్పుడే ముందడుగు వేసి బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించాలని, సైనికులకు అత్యవసర సమయాల్లో అవసరమైన రక్త స్పందన సామాజిక స్ఫూర్తిని పెంచే గొప్ప కార్యక్రమం, యువతకు దేశ సేవలో భాగస్వామ్యం అయ్యే అవకాశం అని అన్నారు. మీ కాలేజ్, యూత్ గ్రూప్, ప్రాంతీయ సంఘాలు ఈ మహాసేవలో ముందడుగు వేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఇది కేవలం క్యాంప్ కాదని దేశానికి మీరు చేసే అత్యున్నతమైన సేవ అని, మీ స్నేహితులను ప్రోత్సహించి, యువతను ఐక్యంగా చేర్చాలని మన భారతీయ సైనికులకు మద్దతు తెలుపాలన్నారు.



## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

- పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత


**వేద న్యూస్, కాజీపేట :**

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ జగదీశ్వర్. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఫాతిమా అడ్డా దగ్గర ఆటో ఎక్కిన దీపక శ్రీరామ్ 16సం, పస్రా అను అతను TS 03UB8318 నెంబర్ గల ఆటోలో హనుమకొండ బస్టాండ్‌లో దిగి తన బ్యాగులు మర్చిపోగా అట్టి బ్యాగు నిజాయితీగా ఫాతిమా అడ్డా దగ్గర డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ భూక్య గణేష్ కు అందించారు. బ్యాగులో ఉన్న వివరాలు తెలుసుకొని అట్టి వ్యక్తి కాల్ చేసి పిలిపించి బ్యాగును కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐ రావెళ్ల రామారావు చేతుల మీదుగా బ్యాగు బట్టలు 2000 రూపాయల నగదు అప్పగించారు. బ్యాగ్‌ను పోగొట్టుకున్న శ్రీరామ్ సంతోషాన్ని వ్యక్తపరిచినాడన్నారు. పక్కనున్న ఆటో డ్రైవర్లు లను ఆటో డ్రైవర్ జగదీశ్వర్ ను కానిస్టేబుల్ గణేష్ ను ఎస్ఐ రామారావు అభినందించారు.

## నరకయాతన చూస్తున్నాం..!

- మురుగు నీరుతో అవస్థలు

**వేద న్యూస్, మడికొండ :**



కాజీపేట పట్టణం, మడకొండ 46 డివిజన్లోని మెట్టు గుట్ట ఆర్చ్ నుండి కెనరా బ్యాంకు వరకు జాతీయ రహదారి పక్కన ఉన్న మురుగు కాలువలోని మురుగు నీరు రోడ్డుపై పేరుకుపోయి నడిచేందుకు సైతం వీలు లేకుండా నరకయాతన పడుతున్నామని స్థానిక ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలోని చెత్తాచెదారం నీరు స్తంభించిపోయి దోమలు, ఈగలు వాలి అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. గత రెండు నెలలుగా మంచినీరు సరఫరా చేసే పైపులు పగిలి వాటి యొక్క నీరు మురుగు కాలువలో కలిసి నీరంతా ఇండ్ల ముందు రోడ్లపైకి వచ్చి చేరుతున్నాయని స్థానికులు తెలిపారు. స్థానిక మున్సిపల్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్ కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవట్లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.

# భారత సైన్యానికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**వేద న్యూస్ రంగారెడ్డి ప్రతినిధి :**

పాకిస్తాన్‌లో జరుగుతున్న పోరులో ప్రతి భారతీయుడు భారత సైన్యానికి అండగా ఉంటూ మన ఐక్యతను చాటాలని మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాడు మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేటలో ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా సాయంత్రం జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. బాలాపూర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పహల్‌గామ్‌లో దేశ పౌరులపై కాల్పులు జరిపి హత్య చేసిన దుర్ఘట నకు ప్రతీకారంగా భారత సైన్యం చేసిన మెసేజ్ దాడి ప్రతి భారతీయుడికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, మీర్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు ఆర్కాల కామేష్ రెడ్డి, కందుకూరు అధ్యక్షులు జయేందర్, మహేశ్వరం అధ్యక్షులు రాజు నాయక్, జలపల్లి సరూర్నగర్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, పలువురుప్రజా ప్రతినిధులు బడంగ్ పేట మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ కాలనీవాసులు ఎత్తున పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై, జై జవాన్ జై కిసాన్ అంటూ, దారి వెంట నినాదాలు చేశారు.



## అనధికార హోర్డింగ్లను తొలగించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది

- ప్రైవేటు, గవర్నమెంట్ పరంగా అధికారులు వ్యత్యాసాన్ని చూపుతున్నారని మండిపడుతున్న స్థానిక ప్రజలు
- కనీస సమాచారం లేకుండా కూల్చివేశారని ఆగ్రహించిన ప్రజలు

**వేద న్యూస్, మడికొండ :**






గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, మడికొండ నేషనల్ హైవే పై ఇరువైపులా ఉన్న అనధికార హోర్డింగ్ బోర్డులను శనివారం టౌన్ ప్లానింగ్ ఏసిపి రజిత ఆధ్వర్యంలో జేసిబి సహాయంతో జి డబ్ల్యూఎంసి డిజాస్టర్ ఫోర్స్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కనీసం ఎటువంటి సమాచారం లేకుండా బోర్డులను కూల్చి వేస్తున్నారని స్థానిక ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు బోర్డులను తొలగించి, గవర్నమెంట్ బ్యాంకు సంబంధించిన బోర్డులను వదిలేసారని ప్రైవేట్ గవర్నమెంట్ పరంగా వ్యత్యాసం చూపుతున్నారని మండిపడ్డారు. వారిని స్థానిక ప్రజలు ప్రశ్నించగా మరొకసారి వచ్చి తీస్తామని ఏసీపీ రజిత దాటవేస్తూ సమాధానం చెబుతున్నారని స్థానిక ప్రజలు వాపోయారు.

# దేశం కోసం మేమంతా ఒక్కటే..

- పార్టీలు..కులాలుగా విడిపోయినా తీవ్రవాదులను మట్టుపెట్టి దేశ ఔన్నత్యాన్ని చాటుతున్నరు
- సైనికుల పోరాట స్ఫూర్తి సైన్యంలో చేరాలనే బావన కల్గిస్తోంది
- సంఘీబావ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**వేద న్యూస్, మంథని :**




బారత దేశ ఔన్నత్యం చాటుతూ, పౌరుషాన్ని చూపుతూ పాకిస్తాన్ తీవ్రవాదులపై మట్టుపెడుతున్న వీర సైనికులకు మేమున్నామని, దేశం కోసం పోరాటం చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని నియోజకవర్గ భీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భారత జవాన్లకు సంఘీభావంగా మంథని పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే చౌక్ నుంచి చాకలి ఐలమ్మ చౌక్ మీదిగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో విభిన్నమైన మతాలు కులాలు బాషలు ఉన్నాఈ దేశం మట్టి గొప్పతనాన్ని చాటుతూ ప్రతి పౌరుడు హింసలేకుండా అహింసామార్గంలో జీవిస్తుంటే పాకిస్తాన్‌లోని తీవ్రవాదులు హింసామార్గాన్ని ఎంచుకుంటున్నారని అన్నారు. పాకిస్తాన్ తీవ్రవాదులకు ఆశ్రయంగా మారిందని, అక్కడ స్థావరాలకు అడ్డగా ఏర్పాటు చేసుకుని దేశాన్ని ప్రపంచాన్ని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అయితే ఏప్రిల్ 22న జరిగిన సంఘటనకు ధీటుగా దేశ సైనికులు తీవ్రవాదులను మట్టుబెట్టారని, ఈ దాడిలో సామాన్యులకు, దేశ సంపదకు ఎలాంటి నష్టం జరుగకుండా చూశారన్నారు. దేశంలో పార్టీలు కులాలుగా విడిపోయినా దేశ సంఘటితం, పటిష్టత కోసం ఏకతాటిపైకి వస్తామని ఈనాడు మూలమూలల నుంచి ప్రజలు సందేశం ఇస్తున్నారని అన్నారు. దేశంలోని ప్రజలంతా ఏకతాటిపై ఉన్నారంటూ ఈనాడు మంథనిలో సైతం అన్ని వర్గాలప్రజలు వ్యాపారులు తమ వ్యాపార సముదాయాలను మూసివేసి సైనికులకు సంఘీబావం తెలుపారని ఆయన అన్నారు. ప్రజల సంఘీబావాన్నిసైనికులు స్వీకరిస్తూ బార్డర్‌లోతీవ్రవాదుల కుట్రలను తిప్పి కొడుతున్నారని, వారి పోరాట స్ఫూర్తితో మనం కూడా సైన్యంలో ఎందుకు చేరకూడదనే బావన ప్రతి ఒక్కరిలో కల్గుతోందన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు తమ బార్యాపిల్లలను, సమాజాన్ని వదిలి కాపలాగా ఉండటంతోనే ఈనాడు మనం సంతోషంగా ఉంటున్నామనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. మనకు రక్షణగా ఉండే సైనికులకు ఎన్ని విధాలుగా సంఘీబావం తెలిపినా తక్కువేనని ఆయన అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్‌లోని తీవ్రవాద స్థావరాలను అంతం చేసే వరకు దేశ సైనికులు పోరాటం కొనసాగించాలని ఆయన అన్నారు. అనంతరం పాకిస్తాన్ తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన తెలుగు బిడ్డ మురళీధర్ నాయక్‌తో పాటు పహల్గాంలో తీవ్రవాదులు హతమార్చిన టూరిస్టులకు ఆయన ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

## 22న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో వెంకటశ్వర స్వామి దేవాలయం కమ్యూనిటీ హాల్ ఎస్బిఐ ఆఫీసర్స్ కాలనీ మూసారం బాగ్‌లో ఈ నెల 22వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య బాధ్యులు సీనియర్ జర్నలిస్ట్ రాజా వరప్రసాద్ తెలిపారు. శనివారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వధూవరుల రిజిస్ట్రేషన్ ఆఖరి తేదీ వచ్చేనెల 15 అని, రిజిస్ట్రేషన్ అప్లికేషన్ కోసం మీరు చెల్లిస్తున్న డబ్బు బీద ఆడపిల్లల చదువు కోసం సీనియర్ సిటిజన్‌ల మందుల కోసం వినియోగించడం జరుగుతుంది అని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తరపున వక్క లంక శ్రీనివాసరావు, బడంగ్ పేట బ్రాహ్మణ సేవా సంఘం రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మంగు రాఘవరావు, బి ఎస్ ఎస్ ఎఫ్ నుండి బసవరాజు శ్రీనివాసరావు, టీబీఎస్ఎస్ నుండి మునిపల్లె శ్రీనివాస్, సరయు పరిచయ వేదిక తరపున వైబివి శ్రీనివాసరావు, వివాహ పరిచయ వేదిక నుండి తుట్టగుంట వేంవీర్రాజు, బ్రాహ్మణ మార్టి మోని నుండి భాస్కరుని రవి, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి పోచంపల్లి రమణారావు, బ్రాహ్మణ సేవా వాహిని నుండి రఘు కిరణాచార్యులు, వైష్ణవి ప్రసాద్, నందుల సత్య కుమార్, ఆలూరి రమేష్ హాజరవుతారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాజా వరప్రసాద్ కోరారు.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**




వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాములను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



## న్యాయవాది కుటుంబాన్ని పరామర్శించిన సుజిత్ రావు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

మెట్‌పల్లి పట్టణంకి చెందిన న్యాయవాది గోరుమంతుల ప్రభాకర్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి గొప్ప నాయకున్ని మంచి న్యాయవాది ని కోల్పోయాము అని విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి మనో ధైర్యం తెలియజేసిన టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు. వారితో పాటు మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, టీపీసీసీ ఫిషర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మారుతీ,మల్లాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మల రాజు,యండి జాఫర్,కల్లెడ గంగాధర్,మామిడి రాజశేఖర్ రెడ్డి,తోగిటి నాగరాజు,బైండ్ల శ్రీకాంత్, వెంకటేష్, సమీర్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073